క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతు బజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 23, వంకాయ 23, బెండ 55, పచ్చి మిర్చి 40, కాకర 35, బీర 45, క్యాబేజి 9, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 15, దొండ 23–28, చిక్కుడు 40, గోకర 45, బీట్‌రూట్ 16, క్యాప్సికం 47, ఆలు 18, దోస 28, సొర 13, పొట్ల 18, ఉల్లి 16, చామగడ్డ 70 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు నాలా పనుల పర్యవేక్షణ

నల్లకుంట: నల్లకుంట శంకరమఠం రోడ్డులో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ నాలా నిర్మాణ పనులను ఆదివారం ఉదయం 10:30 గంటలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యవేక్షిస్తారని బీజేపీ నల్లకుంట డివిజన్ ప్రధాన కార్యదర్శి సురేష్‌యాదవ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

20న ఆంధ్ర బాలానంద సంఘం వార్షికోత్సవం

కాచిగూడ: బాలానందం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 20న రవీంద్రభారతిలో ఆంధ్ర బాలానంద సంఘం 83వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ చిత్తరంజన్, కార్యదర్శి జీవీ కామేశ్వరి తెలిపారు. బాలానందం బాలలచే సాంస్కృతిక ప్రదర్శన, వార్షికోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని వారు పేర్కొన్నారు. వేడుకలకు ప్రముఖ కవి డాక్టర్ నందిని సిద్ధారెడ్డి, ప్రముఖ రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి, లలిత సంగీత దర్శకులు పవీ సాయిబాబా, మిమిక్రీ శ్రీనివాస్, మృత్యుంజయ శర్మ పాల్గొంటారని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రామంతాపూర్: దేవేందర్‌నగర్ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో చర్చి వద్ద శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో వివిధ విభాగాల వైద్యులు సుమారు 200 మందిని పరీక్షించి వైద్య సలహాలు, నేత్ర పరీక్షలతో పాటు ఉచితంగా మందులు, కళ్ల జోళ్లు అందజేశారు. కార్యక్రమంలో సిప్కో ఫార్మాసూటికల్, ఆనంద్ ఐ ఇనిస్టిట్యూట్, బ్రిటిష్ బయోలాజికల్ కంపెనీతో పాటు చర్చి ప్రతినిధులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం ప్రారంభం

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనారాయణ కాలనీలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన కల్యాణ మండపాన్ని శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రారంభినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు లుకాస్, వాసిరెడ్డి శ్రీధర్ ప్రసాద్, నాగేశ్వర్‌రావు, అశోక్‌గౌడ్, వెంకటరెడ్డి, ప్రదీప్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌కు చెందిన ముత్యాల సుదర్శన్ అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని మంత్రి సబితారెడ్డి దృష్టికి బీఆర్‌ఎస్ నాయకులు తీసుకెళ్లగా.. స్పందించిన మంత్రి ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.లక్ష ఎల్‌ఓసీని శస్త్రచికిత్స నిమిత్తం మంజూరు చేయించారు. ఈ చెక్‌ను స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కొళ్లెం ఎల్లారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి, జూకంటి సురేష్‌గౌడ్, సోషల్‌మీడియా కన్వీనర్ సాంబశివ బాధిత కుటుంబానికి అందచేశారు. ఆపదలో ఉన్నవారు సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భాగ్యలక్ష్మి అమ్మవారికి పూజలు



చార్మినార్: పాతబస్తీ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేఎస్.ఆనంద్‌రావుతో కలిసి అంబర్‌పేట్ అదనపు డీసీపీ వెంకట్‌రావు చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ట్రస్టీ శశికళ ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి సత్కరించారు.

హరహర మహాదేవ శంభో శంకర...

- అంగరంగ వైభవంగా మహా శివరాత్రి వేడుకలు
- శివనామ స్మరణలతో మార్మోగిన దేవదేవుడి ఆలయాలు
- అర్చనలు, అభిషేకాలతో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక వాతావరణం
- భక్తజనంతో పోటెత్తిన శివాలయాలు



వీరన్నగుట్టలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సోమనాథ క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, క్షేత్ర ప్రతినిధులు కౌశిక్ మహర్షి

ఎల్‌బీనగర్, దిల్‌సుఖ్‌నగర్: హరహర హరహర మహాదేవ.. శంభో శంకర.. ఓం నమఃశివాయ.. అంటూ భక్తుల శివనామ స్మరణలతో ఆలయాలు హోరెత్తాయి. భక్త సులభుడు, అర్ధనారీశ్వరుడు, గరళకంఠుడు, సదా సచ్చిదానంద స్వరూపుడైన భోళా శంకరుడిని కీర్తిస్తూ భక్తులు పరవశించిపోయారు. ఎల్‌బీనగర్, మలక్‌పేట్ నియోజకవర్గాల పరిధిలోని శివాలయాలతోపాటు ఇతర దేవాలయాలలో మహా శివరాత్రి వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. తెల్లవారుఝామునుంచే భక్తులు ఆలయాలకు చేరుకొని శివపార్వతులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. లింగోద్భవ పూజలు, శివపార్వతుల కల్యాణోత్సవాలను వేడుకగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఆలయాల నిర్వాహకులు పటిష్ఠ ఏర్పాట్లను చేశారు.



మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్నరామ్మోహన్‌గౌడ్



ఐఎస్‌సదన్‌లో శివలింగానికి అభిషేకం చేసిన మాజీ కార్పొరేటర్ సామ స్వప్నాసుందర్‌రెడ్డి



భమరాంబామల్లికార్జున ఆలయంలో కాంగ్రెస్ నేత దేప భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సురేఖారెడ్డి



పూజల్లో మూసారంబాగ్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి దంపతులు

అప్పుల ఊబిలో తెలంగాణ: బీజేపీ

నాగోలు: నీళ్లు, నిధులు, నియామకాల సాధనే లక్ష్యం ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం కల్వకుంట్ల కుటుంబ రాజ్యాంగం అమలవుతోందని, మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయేలా సీఎం కేసీఆర్ మార్చారని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఆరోపించారు. కొత్తపేట డివిజన్‌లో బీజేపీ నాయకులు యప్పాలగౌడ్, ఉపేందర్ సింగ్, సాయినాథ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్–ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సామ రంగారెడ్డి, పవన్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని ధ్వజమెత్తారు. ప్రజలకు దళిత 'బంధు రాలే, మూడు ఎకరాల భూమి రాలే, వృద్ధులకు పింఛన్ రాలే, రేషన్ కార్డులు రాలే' అని వారు పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌ని డల్లాస్‌లా మారుస్తానన్న సీఎం కేసీఆర్ కనీసం డివిజన్ అభివృద్ధికి రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. జీహెచ్ఎంసీని సైతం అప్పుల ఊబిలోకి తోసేశారని వాపోయారు. బీజేపీ అధికారంలో లేకపోయినా కార్పొరేటర్లుగా జీహెచ్ఎంసీ అధికారులతో కొట్లాడి డివిజన్ అభివృద్ధికి నిధులు సాధిస్తున్నామన్నారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇస్తే నిజమైన అభివృద్ధి అంటే ఏంటో సాధించి చూపిస్తామని వారు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి

వ్యక్తి మృతికి కారణమైన హాస్పిటల్‌పై కేసు నమోదు

నాగోలు: ఓ వ్యక్తి మరణానికి కారణమైన హాస్పిటల్‌పై ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... మూడు రోజుల క్రితం ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ రవీందర్ అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కామినేని హాస్పిటల్ వైద్యులు, మేనేజ్‌మెంట్‌పై 304ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. 14 రోజుల క్రితం హెర్నియా ఆపరేషన్ కోసం రవీందర్‌కు చిన్న సర్జరీ చేయాలని చెప్పి కామినేని హాస్పిటల్‌లో జాయిన్ చేసుకుని చివరికి చంపేశారని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్జరీ సమయంలో మత్తు మందు డోస్ అధికంగా ఇచ్చారని... అయితే మత్తు మందు పడలేదని ఐసీయూలో వెంటిలేటర్‌పై పెట్టాలని చెప్పి లక్షలాది రూపాయల డబ్బులు దండుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి చికిత్స పొందుతూ రవీందర్ మృతి చెందాడని, శవాన్ని తీసుకెళ్లాలని ఆస్పత్రి వర్గాలు చెప్పినట్లు మృతుడి బంధువులు పేర్కొన్నారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే రవీందర్ చనిపోయాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆపరేషన్ చేసిన డాక్టర్ కృష్ణా చౌదరితోపాటు ఆస్పత్రి మేనేజ్‌మెంట్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

భాష్యం జెడ్‌ఈఓ అంకమ్మరావు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

మీర్‌పేట: విద్యార్థులు ఇష్టపడి చదవాలని భాష్యం పాఠశాల జెడ్‌ఈఓ అంకమ్మరావు సూచించారు. మీర్‌పేటలోని భాష్యం పాఠశాల 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రధానోపాధ్యాయులు స్రవంతి మాట్లాడుతూ ప్రతి విషయాన్ని సూక్ష్మ పరిశీలనా దృష్టితో చదివితే ఉన్నత ప్రమాణాలను సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ శృతి, వైస్ ప్రిన్సిపాల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా బీఆర్‌ఎస్‌కు ఆదరణ

అబిడ్స్: సీఎం కేసీఆర్‌కు తెలంగాణ తరహాలోనే దేశవ్యాప్తంగా ఆదరణ లభిస్తుందని రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. గంగపుత్రా సమాజ్, జనతా జనార్దన్ సమితికి చెందిన దాదాపు 300 మంది శనివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నందకిశోర్ వ్యాస్ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వ ప్రగతి, అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అన్నివర్గాల వారు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గోషామహల్‌తో పాటు రాష్ట్ర నలుమూలలా బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందన్నారు. మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్, పరమేశ్వరీ సింగ్, సంతోష్‌గుప్తా, ఆల పురుషోత్తమ్, ఆనంద్‌సింగ్, అనిత, శంకర్‌సింగ్ జమేదార్, పప్పుమాత్రే, కోటి శైలేష్ కురుమ, శ్రీను గౌడ్, ప్రదీప్ రాజ్, రవికుమార్, పుష్ప, టింకు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్

శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతర కృషి



చార్మినార్: ఇప్పటి వరకు డబీర్‌పురాలో ఉన్న మీర్‌చౌక్ ఏసీపీ కార్యాలయం పురానీహవేలీ డీసీపీ కార్యాలయం పక్కకు మారింది. ప్రస్తుతం మీర్‌చౌక్ ఏసీపీ డివిజన్ పరిధిలో మీర్‌చౌక్, రెయిన్‌బజార్, భవానీనగర్ పోలీసు స్టేషన్లున్నాయి. ఇప్పటి వరకు మీర్‌చౌక్‌లో ఉన్న మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ ఇక నుంచి ఛత్రినాక ఏసీపీ పరిధిలోకి వెళ్లగా.. డబీర్‌పురా పీఎస్ మలక్‌పేట్ ఏసీపీ పరిధిలోకి వెళ్లింది. డబీర్‌పురాకు మలక్‌పేట్ ఏసీపీ కార్యాలయం రానుంది. కొత్తగా ఏర్పాటు చేసిన మీర్‌చౌక్ ఏసీపీ కార్యాలయాన్ని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య ప్రారంభించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు: డీసీపీ

పాతబస్తీలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నామని డీసీపీ సాయి చైతన్య అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించడానికి ప్రయత్నించే వారి పట్ల కఠినంగా వ్యవహరించనున్నామన్నారు. పోలీసు అధికారులు స్థానిక ప్రజల సహకారంతో ఆయా ప్రాంతాల్లో శాంతి సామరస్యానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మండలం అదనపు డీసీపీ ఆనంద్, మీర్‌చౌక్ ఏసీపీ దామోదర్‌రెడ్డి, మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, రెయిన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్, భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ అంజద్ అలీ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం

అబిడ్స్: మెగా రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన వారికి కాంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీమ్ నిర్మూలన సంస్థ అధ్యక్షుడు స్నితాప్రజ్ఞ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ ఆధ్వర్యంలో జరిగిన మెగా రక్తదాన శిబిరంలో దాదాపు 700 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా స్నితప్రజ్ఞ వారి సర్టిఫికెట్లు ప్రదానం చేసి ప్రసంగించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆయన అన్నారు. డాక్టర్ ముజీబ్ హుస్సేని మానవతా దృక్పథంతో ఒక సామాజిక కార్యక్రమం చేపట్టడం ఎంతో గొప్పదని అభినందించారు.

పండగ పూటా పారిశుద్ధ్యం పట్టదా?



వాదే ముస్తఫా బస్తీలో రోడ్లపై పేరుకుపోయిన చెత్త

- ముందే చెప్పినా పట్టించుకోని మున్సిపల్ కమిషనర్
- మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్

పహాడీషరీఫ్: ముస్లింల పవిత్రమైన షబ్–ఏ–మేరాజ్ పండగ పూట స్థానికంగా పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడం ఎంతవరకు సమంజసమని బీఆర్‌ఎస్ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ ప్రశ్నించారు. రాత్రి పూట జరుపుకొనే ఉత్సవాన్ని పురస్కరించుకొని వాదే ముస్తఫా బస్తీలోని మజీద్‌లు, ప్రధాన రహదారుల వెంట చెత్త చెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.వసంతకు మూడు రోజుల ముందు నుంచే విన్నవించామని హుస్సేన్ తెలిపారు. అయినప్పటికీ కమిషనర్ ముస్లిం బస్తీలపై చిన్న చూపు చూస్తూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజా సమస్యలు పట్టించుకోకపోవడంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

హామీల అమలులో సీఎం కేసీఆర్ విఫలం

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి



వనస్థలిపురంలో మాట్లాడుతున్న నల్లు ఇంద్రసేనారెడ్డి

వనస్థలిపురం: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ కూడా నెరవేర్చలేదని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి వనస్థలిపురంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దళిత సీఎం, మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఉద్యోగాల భర్తీ తదితర హామీలను కేసీఆర్ నెరవేర్చలేకపోయారని ధ్వజమెత్తారు. కేసీఆర్, మంత్రి కేటీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారని ఆయన ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలో దేశం ప్రగతిపథంలో పయనిస్తోందని అన్నారు. త్వరలో తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కారు రాబోతుందని ఆయన జోస్యం చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా (అర్బన్) అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఎల్‌బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్, కార్యదర్శి క్రాంతిగౌడ్, నాయకులు విజయ్‌కుమార్, అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీరన్నగుట్ట సర్వతోముఖాభివృద్ధికి కృషి...

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ఇచ్చిన హామీ మేరకు వీరన్న గుట్టను రూ. 13 కోట్లతో అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ వీరన్నగుట్టను శనివారం కాలనీవాసులతో కలిసి సందర్శించారు. వీరన్నగుట్ట చుట్టూ రూ. 1.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయించారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... వీరన్నగుట్ట అభివృద్ధిలో కాలనీల ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. కాలనీకి ఒక్కరి చొప్పున తన వంతు సాయం అందించడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. రాబోయే రెండేళ్లలో గుట్ట పరిసర ప్రాంతాలను సుందరీకరించి ఆహ్లాదంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గుట్ట అభివృద్ధికి హెచ్ఎండీఏ నుంచి రూ. 13 కోట్లు మంజూరు చేయించామని అంటూ తాను హామీ ఇస్తే ఒకరోజు అటో ఇటో వంద శాతం ఆ హామీని నెరవేరుస్తానని దేవిరెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు టంగుటూరి నాగరాజు, ధనలక్ష్మీ, జగదీశ్‌యాదవ్, నరహరిశెట్టి, కె.కె.ఎల్.గౌడ్, కడమంచి అనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బచ్‌పన్ స్కూల్ వార్షికోత్సవం

నాగోలు: విద్యార్థులకు చదువుతోపాటు అన్ని విషయాలపై అవగాహన కల్పిస్తున్నామని బచ్‌పన్ స్కూల్స్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ పాఠశాల రీజనల్, అకడమిక్ డైరెక్టరు శ్రీకాంత్‌రెడ్డి, రూపారెడ్డి అన్నారు. కొత్తపేట బచ్‌పన్, అకడమిక్ హైట్స్ పబ్లిక్ పాఠశాల వార్షికోత్సవం కొత్తపేటలో శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు చిన్నప్పటి నుంచే అన్ని విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. వారిలో దాగి ఉన్న ప్రతిభను బయటకు రాబట్టాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జితేంద్రదేవి, పంకజ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలో చిన్నారులు

కొనసాగుతున్న నవ చండీ యాగం



పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేజ్–2లోని రేణుక రాజేశ్వరి పీఠం జగన్మాత ఆలయంలో మొల్లూరి నవీన్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుద్ర సహిత నవ చండీ యాగం రెండో రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. యాగంలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్తనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కాలనీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రదీప్, రాజశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు తవ్వి వదిలేస్తే ఎలా?

మలక్‌పేట: పాడైన రోడ్లు బాగు చేయడం కోసం పాత రోడ్లను తవ్వుతున్నారు. ఆయా రోడ్లకు మరమ్మతులు చేసి ప్రజలకు ముఖ్యంగా వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అధికారులు ఆ విషయాన్ని విస్మరిస్తున్నారు. తవ్విన రోడ్లను అలాగే వదిలేస్తుండటంతో పలు కాలనీల్లో వాహనదారులు, పాదచారు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజులు గడుస్తున్నా తవ్విన రోడ్ల బాగును పట్టించుకునే వారే లేరంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూసారంబాగ్ డివిజన్‌లో కృష్ణతులసి నగర్‌లో కొత్త రోడ్డు వేయడానికి పాత రోడ్డును తవ్వేశారు. రోడ్డు తవ్వి దాదాపు 25 రోజులు కావస్తున్నా రోడ్డు నిర్మాణ పనులను చేపట్టలేదు. దీంతో కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు ఇంటి వరకు వచ్చే వీలు లేకుండా పోయింది. సంబంధిత కాంట్రాక్టర్‌కు రోడ్ తవ్వకాలపై ఉన్న శ్రద్ధ పనులపై లేదని, అధికారుల పర్యవేక్షణ కొరవడి అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతోందని డివిజన్ వాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్యపై దృష్టి సారించి రోడ్డు నిర్మాణాన్ని సత్వరమే పూర్తి చేయాలని కోరుతున్నారు.



కృష్ణతులసి నగర్‌లో తవ్విన రోడ్డు

విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలి



వేడుకలను ప్రారంభిస్తున్న డీఐజీ రమేష్‌రెడ్డి

కాచిగూడ: విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డీఐజీ ఎం.రమేష్‌రెడ్డి అన్నారు. బర్కత్‌పురలోని తెలంగాణ యువతి మండలి రాణి స్కూల్, బూర్గుల రామకృష్ణారావు బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు భవిష్యత్తులో మరింత ఉన్నతంగా రాణించగలుగుతారన్నారు. విద్యార్థులకు విజ్ఞానంతో కూడిన విద్య అవసరమని, ఆ దిశగా చదవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన పలు నృత్య ప్రదర్శనలు అందరిని అలరించాయి. స్వాతంత్ర్య అమృతోత్సవాల్లో భాగంగా 75 ఏళ్లలో దేశాన్ని పాలించిన ప్రధానుల పరిపాలన విశేషాలతో కూడిన నృత్యరూపకం, స్వాతంత్ర సంగ్రామంలో చేసిన పోరాట సమరయోధుల ఇతివృత్తంతో కూడిన నాటకాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ యువతి మండలి అధ్యక్షురాలు శేషు విఠల్, కార్యదర్శి నివేదిత కుమార్, కరస్పాండెంట్ మంజులదేవి, హెడ్ మిస్ట్రెస్ ఉదయలక్ష్మి, శ్రీవాణి, గాలి గాయత్రి పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో యాగశాల ప్రారంభం

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా పూల్‌బాగ్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన యాగశాలను చాంద్రాయణగుట్ట నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి ముప్పిడి సీతారాంరెడ్డి శనివారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆలయ అర్చకులు కందాల మోహనాచార్యుల మంత్రోచ్చరణల నడుమ ఆలయ కమిటీ చైర్మన్ బాశెట్టి లెనిన్ బాబు, దాతలు ప్రభాకర్, రాణి దంపతులు యాగశాలను రిబ్బన్ కట్ చేశారు. అనంతరం దివంగత బురుగు అల్వాలు జ్ఞాపకార్థం భార్య బురుగు చంద్రకళ, కుమారుడు ప్రభాకర్, రాణి దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో లాల్‌దర్వాజా ఆలయ ఫోర్‌మెన్ కమిటీ అధ్యక్షుడు శివకుమార్‌యాదవ్, ఈఓ నోముల శ్రీనివాస్, ధర్మకర్తలు సరాబు లక్ష్మణ్ గుప్తా, లింగాల యాదగిరి, కె.శారద, పట్లూరి వేంకటేశ్వర్ రావు, బి.మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



యాగశాలను ప్రారంభిస్తున్న ముప్పిడి సీతారాంరెడ్డి